క్లుప్తంగా

స్నేహితుడి కుటుంబానికి రూ.70 వేల సాయం



స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సహాయం అందిస్తున్న మిత్రులు

సబ్బవరం: మండలంలోని గొల్లలపాలేనికి చెందిన కోశిరెడ్డి సంతోష్ ఇటీవల మరణించాడు. అతనికి భార్యతో పాటు 4 ఏళ్ల కుమార్తె ఉన్నారు. ఆ కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడుతుండడంతో సంతోష్‌తో 10వ తరగతి వరకూ చదువుకున్న వారు సంకల్పించారు. స్నేహితుడి కుటుంబాన్ని ఆదుకోవాలన్న మంచి మనసుతో గ్రామస్తులు,రాజీవ్‌నగర్ ఆటో స్టాండ్ డ్రైవర్లు సహకారంతో రూ.70 వేలు పోగుచేసి ఆ మొత్తాన్ని సోమవారం గ్రామంలోని కుటుంబ సభ్యులకు అందజేశారు.

సమావేశం వాయిదా

సింహాచలం: అడవివరం గ్రామ దేవత, శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి సోదరి పైడితల్లి అమ్మవారి వార్షిక పండగ నిర్వహణ తేదీల ఖరారుకు సోమవారం జరగాల్సిన సమావేశం వాయిదా పడింది. నృసింహసదన్‌లో దేవస్థానం అధికారులు పండగ నిర్వహణపై చర్చించడానికి గ్రామపెద్దలు, అమ్మవారి పూజారి వంశీయులతో సమావేశం నిర్వహించేందుకు ఉపక్రమించారు.అయితే కొంతమంది గ్రామ పెద్దలు, పూజారి వంశీయులు గైర్హాజ కావడంతో సమావేశాన్ని ఈ నెల 30కి వాయిదా వేసినట్లు అధికారులు తెలిపారు.

పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలి




ధర్నాలో ప్రసంగిస్తున్న కార్పొరేటర్ గంగారావు

ఉక్కునగరం: ఇటీవల యాజమాన్యం ఏకపక్షంగా పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు డిమాండ్ చేశారు. టౌన్‌షిప్‌లో నివసిస్తున్న కార్మికుల క్వార్టర్ల విద్యుత్ చార్జీల పెంపునకు నిరసనగా స్టీల్ సీపీఎం ఆధ్వర్యంలో ఉక్కు టౌన్ అడ్మినిస్ట్రేషన్ బిల్డింగ్ వద్ద సోమవారం ధర్నా చేశారు. ఉక్కు ఉద్యోగులు తమ కుటుంబ సభ్యులతో పాల్గొని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కర్మాగారం కొన్న రేటుకే గృహ వినియోగదారులు చెల్లించాలని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఇటువంటి అనాలోచిత చర్యలను యాజమాన్యం విరమించుకోకపోతే ఉద్యమం ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు కె.విమల, పి.శ్రీనివాసరాజు, స్టీల్ సీఐటీయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వై.టి.దాస్, యు.రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

లలితా పీఠంలో 1న హనుమజ్జయంతి

ఏయూ క్యాంపస్: స్థానిక కిర్లంపూడిలోని లలితా పీఠంలో వచ్చేనెల 1న హనుమజ్జయంతిని నిర్వహించనున్నట్టు ఆలయ ప్రధాన పురోహితుడు కాండూరి లక్ష్మణస్వామి తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి శ్రీఅభయాంజనేయస్వామికి సహస్ర తమల పత్ర సిందూరార్చన నిర్వహిస్తామని పేర్కొన్నారు. పూజా కార్యక్రమాల్లో పాల్గొనే భక్తులు రూ.100 చెల్లించాలన్నారు.

మతిస్థిమితం లేని వ్యక్తి అదృశ్యం



రాజేష్

మద్రిపాలెం: మతిస్థిమితం లేని ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. జ్ఞానాపురం గెడ్డ వీధిలో తల్లిదండ్రులతో కలిసి నివసిస్తున్న పరతావు రాజేష్ ఓ మందుల షాపులో పనిచేస్తున్నాడు. ఇతడికి సుమారు పదేళ్ల నుంచి మతిమరుపు ఉంది. తల్లి మందులు వేసుకోమని చెప్పినందుకు ఆమెతో గొడవపడి ఈ నెల 1న ఇంటి నుంచి బయటకు వెళ్లి, ఇప్పటి వరకు చేరుకోలేదు. ఫోన్ కూడా స్విచ్ ఆఫ్‌లో ఉంది. అంతటా వెతికినా ప్రయోజనం లేకపోవడంతో అతడి తల్లి రాణి ఫిర్యాదు చేసినట్టు సోమవారం పోలీసులు తెలిపారు. రాజేష్ 5.2 అంగుళాల పొడవు, తెల్లరంగు ఛాయతో ఉంటాడు. ఎవరికైనా ఆచూకీ తెలిస్తే సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

అణువణువూ జల్లెడ



సాయినగర్ కాలనీలో సీజ్ చేసిన వాహనాలతో సబ్బవరం పోలీసులు



వాహనదారులతో మాట్లాడుతున్న సీఐ పిన్నింటి రమణ

- సాయినగర్‌లో కార్డన్ సెర్చ్
- 265 గృహాల్లో ముమ్మరంగా తనిఖీలు
- 26 మోటారు వాహనాల సీజ్

సబ్బవరం: శాంతిభద్రతల పరిరక్షణపై పోలీసులు ప్రత్యేక దృష్టిసారించారు. నేరాలు కట్టడి చేయడానికి నడుంబిగించారు. దీనిలో భాగంగా కార్డన్ సెర్చ్ ప్రారంభించారు. ఆయా ప్రాంతాల్లో నిందితులు, అనుమానితులు ఉంటే తప్పించుకునే అవకాశం లేకుండా తెలతెలవారక ముందే నిర్దేశించుకున్న ప్రాంతాలను పోలీసులు చుట్టుముడుతున్నారు. ఆ తర్వాత ప్రతి ఇంటితో పాటు ఆ ప్రాంతాల్లో ఉన్న వాహనాలను పరిశీలిస్తున్నారు. రికార్డులు సక్రమంగా లేని వాటిని సీజ్ చేస్తున్నారు. అనుమానితులు ఉంటే అదుపులోకి తీసుకుంటున్నారు.

అలజడి

మండలంలోని సబ్బవరం సాయినగర్ కాలనీలో సోమవారం అలజడి రేగింది. కాలనీవాసులు నిద్రమత్తులో ఉండగానే సీఐ పిన్నింటి రమణ ఆధ్వర్యంలో పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. సుమారు 45 మంది వరకు పోలీసులు కాలనీలోని 265 గృహాలను పరిశీలించారు. వాహనాలను తనిఖీ చేశారు. సరైన డాక్యుమెంట్లు లేని 26 మోటారు వాహనాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా సీఐ రమణ మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అపరిచిత వ్యక్తులు, వారి కదలికలపై నిఘా ఏర్పాటు చేశామన్నారు. స్థానికులు ఎవరైనా తమ ప్రాంతాల్లో అనుమానాస్పదంగా సంచరిస్తున్నా, మారణాయుధాలు కలిగినా అటువంటి వారి గురించి సమాచారం ఇవ్వాలని కోరారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడే వారిని గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చే వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు. తాము సీజ్ చేసిన మోటారు వాహనాలకు సంబంధించి సరైన డాక్యుమెంట్లు తీసుకొచ్చిన వారికి మోటార్ సైకిళ్లు అప్పగించడం జరుగుతుందన్నారు. సీజ్ చేసిన వాహనాలను కోర్టులో హాజరు పరిచి న్యాయస్థానం తీర్పును అనుసరించి చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

ఇంకుడు గుంతలతో భూగర్భ జలాల పరిరక్షణ

- ఏపీఎఫ్ఈఆర్‌డబ్ల్యూఏఎస్ జోనల్ కోఆర్డినేటర్ పులకల మాధవరావు



పులకల మాధవరావు



ప్రియాగార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన ఇంకుడు గుంత

సింహాచలం: భూగర్భ జలాలు అడుగంటుతున్న తరుణంలో ప్రతి ఇంటి ఆవరణలో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ఫెడరేషన్ ఆఫ్ రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్స్ జోనల్ కోఆర్డినేటర్ పులకల మాధవరావు చెప్పారు. విశాఖపట్నం చాప్టర్ ఆధ్వర్యంలో జీవీఎంసీ పరిధిలోని ఏపీఎఫ్ఈఆర్‌డబ్ల్యూఏఎస్‌లో సభ్యత్వం కలిగిన కాలనీల్లో ఇంకుడు గుంతల ఏర్పాటుకు చర్యలు చేపట్టడం జరిగిందని తెలిపారు. ఒక్కో జోన్ పరిధిలో 8 చొప్పున ఇంకుడు గుంతలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. దీనిలో భాగంగా పెందుర్తి జోన్‌లో కృష్ణరాయపురం సమీపంలోని ఎస్‌ఏడీ కాలనీ, సింహాచలంలోని ప్రియా గార్డెన్స్, సింహపురి లేఅవుట్, పద్మావతినగర్ కాలనీ, షిప్‌యార్డ్ లేఅవుట్, ఎయిర్‌పోర్టు దగ్గర ఉన్న విమాన నగర్‌కాలనీలో ఒక్కొక్కటి చొప్పున, ప్రహ్లాదపురంలోని మోదీ స్ట్రీట్‌లో రెండు ఇంకుడు గుంతలు తొలివిడతగా తీస్తున్నట్టు తెలిపారు. వాటికయ్యే ఖర్చును ఏపీఎఫ్ఈఆర్‌డబ్ల్యూస్ అందిస్తుందన్నారు. ఏపీఎఫ్ఈఆర్‌డబ్ల్యూఏఎస్ అధ్యక్షుడు ఉదయ్ శర్మాజి, అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ కె.ఎస్.ఆర్.మూర్తి, సెక్రటరీ దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో ఈ పనులు జరుగుతున్నాయన్నారు.

అవగాహన కార్యక్రమాలు విస్తృతం

ఇంకుడు గుంతల ఆవశ్యకతపై ఇళ్ల యజమానులకు అవగాహన కల్పించడం జరుగుతోందన్నారు. 93వ వార్డులో నిర్వహించిన అవగాహన సదస్సుల వల్ల ప్రజల్లో చైతన్యం వచ్చిందని మాధవరావు చెప్పారు. దీనిలో భాగంగా ఆయా ఇళ్ల యజమానుల సొంత ఖర్చుతోనే ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకుంటున్నారని తెలిపారు. ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో గణేషకాలనీ ప్రతినిధి గార్లపాటి అవినాష్ పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు వేతనాలు పెంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న కోటేశ్వరరావు

పరవాడ: ఉపాధి హామీ కూలీల వేతనాలు పెంచాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. తానాం గ్రామంలో చెరువు పనులు చేస్తున్న ఉపాధి హామీ కూలీలనుద్దేశించి ఆయన మాట్లాడారు. ఉపాధి కూలీలకు కనీస వేతనం రూ.600 చెల్లించాలన్నారు. తాగునీరు తీసుకువచ్చే మనిషికి దూరాన్ని బట్టి కూలి చెల్లించాలన్నారు. వేసవిలో 30 శాతం అలవెన్సును చెల్లించి ఆదుకోవాలని కోటేశ్వరరావు డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ, పార్వతి, రమణమ్మ, అప్పారావు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాలలో ధ్రువపత్రాల పరిశీలన



విద్యార్థికి అడ్మిషన్ పత్రం అందిస్తున్న ప్రిన్సిపాల్ చంద్రశేఖర్

పెందుర్తి: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ర్యాంక్‌ల ఆధారంగా సోమవారం విద్యార్థుల ధ్రువపత్రాలను పరిశీలించారు. తొలి రోజు పాలిసెట్ ర్యాంక్ 1 నుంచి 12000 వరకు ఉన్న విద్యార్థులను పిలిచారు. 2033 ర్యాంక్ విద్యార్థి బి.జగదీష్‌కు అడ్మిషన్ పత్రం ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.చంద్రశేఖర్ చేతుల మీదుగా అందించారు. 12001–27000 ర్యాంక్‌ల విద్యార్థుల ధ్రువపత్రాలను మంగళవారం పరిశీలిస్తామని ప్రిన్సిపాల్ తెలిపారు. అధ్యాపకులు కె.సత్తిబాబు, వి.ఆర్.ఎస్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అప్పన్న నిత్యకల్యాణం



యజ్ఞోపవీతం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు



నిత్యకల్యాణంలో పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం,శేషవస్త్రాలు అందజేశారు.

హ్యాక్‌థాన్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులు తయారు చేసిన వ్యవసాయ రోబోటిక్స్



సాధించిన ప్రశంసా పత్రాలతో విద్యార్థులు

సబ్బవరం: ఆంధ్రా విశ్వవిద్యాలయంలోని ఇంక్యుబేషన్ సెంటర్‌లో ఈ నెల 26న రాష్ట్రస్థాయిలో నిర్వహించిన హ్యాక్‌థాన్ పోటీల్లో సబ్బవరం ప్రతిభా విద్యాలయం విద్యార్థులు తమ సత్తాచాటారు. అటల్ టింకరింగ్ ఇన్నోవేషన్ ప్రదర్శనలో భాగంగా రోబోటిక్స్ విభాగంలో కె. అభిషేక్ బృందం ఆవిష్కరించిన అగ్రి రోబోటిక్స్ అత్యుత్తమ ప్రదర్శనల్లో నిలిచిన 5 టీమ్‌లలో మూడో స్థానంలో నిలిచిందని పాఠశాల కరస్పాండెంట్ ఆదిరెడ్డి రమణ తెలిపారు. అటల్ టింకరింగ్ ల్యాబ్ ఇన్‌చార్జ్,పాఠశాల సైన్స్ టీచర్ బోకం తులసీ ప్రియాంక నేతృత్వంలోని కాపల అభిషేక్(పదోతరగతి),లగుడు మోహన్ వంశీ(9వ తరగతి),బొడ్డేటి కావ్యప్రియ(8వ తరగతి),జి జ్ఞాన సాత్విక్(7వ తరగతి) బృందం ఆవిష్కరించిన అగ్రి రోబోటిక్ నమూనాకు గుర్తింపు లభించిందన్నారు. వ్యవసాయ రంగంలో పంట నమూనాల సేకరణ నుంచి ఆయా పంటల నాట్లు, పంట చేతికి వచ్చే వరకూ అన్ని రకాల పనులు ఈ రోబోటిక్స్ చేసేవిధంగా నమూనాను ఆవిష్కరించారన్నారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులను సోమవారం ఆయన అభినందించారు.

ఉమాచంద్రమౌళీశ్వరుడికి విశేష అభిషేకాలు



ఉమాచంద్రమౌళీశ్వర స్వామి

సింహాచలం: అడవివరం దరి విజినిగిరిపాలెంలోని ఉమా చంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలో సోమవారం స్వామి వారికి విశేష అభిషేకాలు, పూజలు జరిగాయి. అడవివరం, విజినిగిరిపాలెం,కృష్ణానగర్ తదితర ప్రాంతాల నుంచి భక్తులు విశేషంగా తరలివచ్చారు. పరమేశ్వరుడికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. మహిళలు ఉమాదేవి అమ్మవారిని దర్శించుకుని కుంకుమ పూజలు చేశారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ ఈ కార్యక్రమాలను నిర్వహించారు.

అనధికార పార్కింగ్‌తో అవస్థలు



రోడ్డుపై నిలిపిన బొగ్గు లారీలు

పరవాడ: మండలంలోని పరవాడ మండల కాంప్లెక్సు, సినిమాహాలు కూడలి, ఊటగెడ్డ కూడలి తదితర ప్రాంతాల్లో అనధికార పార్కింగ్‌తో ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. విశాఖ, తదితర ప్రాంతాల నుంచి పరిశ్రమలకు బొగ్గు సరఫరా చేసే బొగ్గు లారీలు లంకెలపాలెం మీదుగా రాత్రి పగలు తేడా లేకుండా ప్రయాణిస్తున్నాయి. వాహనాలను రోడ్ల పక్కన నిలిపి టీ, టిఫెన్, భోజనాల కోసం హోటళ్లకు వెళ్లి గంటల తరబడి కాలయాపన చేయడంతో ప్రయాణికులు వాహనాలను తప్పించుకొని రాకపోకలు సాగించడానికి ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి వేళల్లో రోడ్ల పక్కన నిలిపిన వాహనాలను గుర్తించలేక తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. దారి పొడవునా నిలుపుతున్న బొగ్గు వాహనాల కారణంగా వేరే భారీ వాహనం ప్రయాణించడం కష్టమవుతుంది. రోడ్ల పక్కన యథేచ్ఛగా నిలుపుతున్న వాహన యజమానులపై పోలీసులు చర్యలు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

అక్రమ నిర్మాణాల తొలగింపు



అక్రమ నిర్మాణాలను తొలగిస్తున్న రెవెన్యూ సిబ్బంది

సబ్బవరం: సబ్బవరం కేజీబీవీకి కేటాయించిన స్థలంలో నిర్మిస్తున్న అక్రమ కట్టడాలను రెవెన్యూ సిబ్బంది సోమవారం తొలగించారు. సబ్బవరం కేజీబీవీకి సర్వే నెంబర్ 286లో సుమారు రెండు ఎకరాలు కేటాయించారు. అందులో పాఠశాలతో పాటు కళాశాల భవనాలు నిర్మించారు. అయితే కేటాయించిన స్థలానికి పూర్తి స్థాయిలో సర్వే చేసి హద్దులు నిర్ధారించకపోవడంతో కొంత స్థలం ఇప్పటికే ఆక్రమణలకు గురైంది. మరోసారి కేజీబీవీ కళాశాల భవనాలను ఆనుకొని సోమవారం నిర్మాణాలు చేపడుతుండడంతో కేజీబీవీ ఎస్‌వో మృదుల రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. వీఆర్వో నూకరత్నం మిగిలిన సిబ్బందితో కలిసి అక్రమ నిర్మాణాలను తొలగించారు. అక్రమ నిర్మాణాలు చేపట్టిన వారిపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు.

108 వాహనాల రికార్డుల పరిశీలన



రికార్డులు పరిశీలిస్తున్న 108 జోనల్ మేనేజర్ నజీర్

మహారాణిపేట : గర్భిణులపట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఇంటి నుంచి ఆస్పత్రికి తరలించాల్సిన అంశాలను ఈఎంటీలకు 108 విభాగ జోనల్ మేనేజర్ నజీర్ వివరించారు. సోమవారం ఆయన కేజీహెచ్ గైనిక్, అత్యవసర వార్డులను సందర్శించి, రోగులను ఏ విధంగా పెద్దాస్పత్రికి తరలిస్తున్నారో వైద్యులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రోగుల పట్ల సిబ్బంది వ్యవహరిస్తున్న తీరును తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 102,104,108వాహనాల్లో మందుల కొరత ఉండకూడదని, వాహనాలు కూడా శుభ్రంగా ఉండాలని ఆదేశించారు. అనంతరం 108 రికార్డులను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో 108 విభాగ విశాఖ సిటీ కో–ఆర్డినేటర్ ఎం.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పైడితల్లి అమ్మవారికి సారె సమర్పణ



సారె ఊరేగిస్తున్న మహిళలు



పైడితల్లి అమ్మవారికి సమర్పించిన సారె

గాజువాక : పాత కర్ణవానిపాలెం గ్రామదేవత పైడితల్లి అమ్మవారి పండగ మహోత్సవాల్లో భాగంగా గ్రామంలోని మహిళలు అమ్మవారికి సోమవారం సారె సమర్పించారు. గ్రామ కమిటీ ఆధ్వర్యంలో మహిళలు వివిధ రకాల పళ్లు, స్వీట్లతో ఆలయం వరకు ఊరేగింపుగా వెళ్లి సారెను అందజేశారు. మంగళవారం అమ్మవారి ప్రధాన పండగ నిర్వహించనున్న నేపథ్యంలో సారెను సమర్పించినట్టు గ్రామ కమిటీ పెద్దలు తెలిపారు. పెద్ద పండగ సందర్భంగా బళ్ల వేషాలతో ఊరేగింపుతో పాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ పెద్దలు కరణంరెడ్డి నర్సింగరావు, కరణం కనకారావు, సిరసపల్లి అప్పారావు, మడగల కన్నయ్య, గొంతిన దేముడు, కరణంరెడ్డి రాము, సాలాపు నూకరాజు, కరణం సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రుతుక్రమంపై అవగాహన అవసరం



రుతుక్రమం-ఆరోగ్యం పరిశుభ్రత పోస్టర్లు ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మహారాణిపేట: రుతుక్రమంపై మహిళలకు అవగాహన అవసరమని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి(డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. ఈ మేరకు సోమవారం రేసపువానిపాలెంలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో ప్రోగ్రాం అధికారుల సమావేశంలో రుతుక్రమం-ఆరోగ్యం, పరిశుభ్రత దినోత్సవానికి సంబంధించి వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల్లో నెలసరి అనేది సాధారణ శరీర ప్రక్రియ అని, సాధారణంగా 10 నుంచి 14 సంవత్సరాలలోపు మొదలై 45–49 సంవత్సరాల మధ్యలో రుతుక్రమం ఆగిపోతుందని చెప్పారు. 'టుగెదర్ ఫర్ ఏ పీరియడ్ ఫ్రెండ్లీ వరల్డ్'(నెలసరి సమయంలో స్నేహపూర్వకంగా ఉండటం) ఈ సంవత్సరం నినాదమని చెప్పారు. స్కూళ్లు, కాలేజీలకు వెళ్లే విద్యార్థినులకు అందుబాటులో శానిటరీ నాప్‌కిన్‌లు, ఐరన్ పోలిక్ మాత్రలు తీసుకునేలా ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మీడియా విస్తరణ అధికారి(డిమో) బి.నాగేశ్వరరావు, జిల్లా నోడల్ అధికారి డాక్టర్ బి.ఉమావతి, పలు విభాగాల ఇన్‌చార్జి డాక్టర్ సమత, మురళీకృష్ణ, ఐ.మనోరమ, డాక్టర్ హీనా దీక్షిత్, శాంతి ప్రియ, నాగభూషణం, సిబ్బంది, వైద్యులు పాల్గొన్నారు.

'అభినవ సౌబల'కు ఘన సత్కారం



రొంగలి రాములును సత్కరిస్తున్న అమరావతి విశ్వసాహితి సభ్యులు

మురళీనగర్: అభినవ సౌబల బిరుదు పొందిన రంగస్థల నటుడు రొంగలి రాములును అమరావతి విశ్వసాహితి సభ్యులు ఘనంగా సత్కరించారు. మురళీనగర్ భరద్వాజ క్షేత్రంలో సోమవారం నిర్వహించిన విశ్వసాహితి ప్రత్యేక సమావేశంలో రొంగలి రాములు నిర్వహించిన పౌరాణిక పాత్రల ప్రతిభను, ఆయనలోని సద్గుణాలను వక్తలు శ్లాఘించారు. తనను సత్కరించిన సభ్యులను రాములు కృతజ్ఞతలు తెలిపారు. కవి సమ్మేళనంలో విశ్వసాహితి ప్రధాన కార్యదర్శి సిహెచ్.చిన సూర్యనారాయణ, పిల్లా అర్జునుడు, పొలమరశెట్టి ఫ్రాన్సిస్, పి.వి.ఎల్.ప్రసాద్, తిరుపతిరావు, రాంతాత, పి.రామారావు, కె.కృష్ణ, ఎ.సత్యనారాయణ, బి.వెంకటేశ్వరరావు, డి.ఎస్.కుమార్, కె.రామారావు, బి.వి.రమణమూర్తి, పి.రామారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు యోగాలో శిక్షణ

పెదగంట్యాడ: యోగ సాధన వల్ల శరీరాన్ని ఆరోగ్యంగా, మనసును ప్రశాంతంగా ఉంచుకోవచ్చని పెదగంట్యాడ శాఖా గ్రంథాలయ అధికారి పీవీ రమణ అన్నారు. వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా పెదగంట్యాడ శాఖా గ్రంథాలయంలో విద్యార్థులతో సోమవారం యోగా చేయించారు. వారితో వివిధ రకాల కథల పుస్తకాలు చదివించారు. వారి సందేహాలను నివృత్తి చేశారు.